## • ప్రమాదకరంగా గుంత



వంతెన చివరి భాగంలో ఏర్పడిన గుంత

బోథ్ సమీపంలో పెద్దవాగుపై జీడిపల్లె మార్గంలో నిర్మించిన వంతెనపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. వంతెన చివరి భాగంలో సిమెంట్ లేచిపోయి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. గుంత పడిన చోట సిమెంట్ దిబ్బెలు వాహనాల రాకపోకలతో లేచిపోతున్నాయి. వానకాలం సమీపిస్తున్నందున రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి కావాల్సిన మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –బోథ్, మే 15

## బోథ్‌లో 27,790 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు

బోథ్, మే 15 : బోథ్ మార్కెట్ యార్డులో బుధవారం వరకు 27,790.50 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 23వ తేదీన కొనుగోళ్లు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 1308 మంది రైతులకు చెందిన 55,581 బస్తాల (27,790.50 క్వింటాళ్ల) జొన్నలు కొన్నట్లు పేర్కొన్నారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 3,180 చెల్లిస్తున్నామని తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఇచ్చోడ, మే 15: గేర్జం గ్రామంలో పడిగెల గంగయ్య అనే రైతుకు చెందిన ఆవు బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఇటీవల కురిసిన వర్షాలకు కరెంట్ తీగలు కింద పడ్డాయి. మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.20 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. సంబంధిత శాఖాధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

## ఎన్‌పీఎల్ క్రీడాదుస్తుల కోసం సాయం

నేరడిగొండ, మే 15 : మండల కేంద్రంలో ఈ నెల 18 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే క్రీడాకారుల దుస్తుల కోసం స్థానిక యువ నాయకుడు రాథోడ్ రాజశేఖర్ రూ.10వేలు సాయం అందించాడు. తన తండ్రిగారైన దివంగత రాథోడ్ గుండాజీ జ్ఞాపకార్థం లీగ్‌లో పాల్గొనే టెర్రిఫిక్ హిట్టర్స్ జట్టుకు క్రీడాదుస్తులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ యోగేశ్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్, లఖన్, అనిల్, దినేశ్, గణేశ్, ఆదిత్య, సునీల్, సతీశ్, సురేందర్,శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

## ఒకరి ఆత్మహత్య

భీంపూర్, మే 15 : భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల పొచ్చన్న(58) కుమారులతో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు . పొచ్చన్న కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు పెరిగాయి. మద్యం కోసం డబ్బులు దొరకని పరిస్థితి రావడంతో జీవితంపై విరక్తి కలిగి మంగళవారం రాత్రి గ్రామం వెనుక ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- అధికారులతో సమావేశం

నిర్మల్ టౌన్, మే 15 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లు, వర్షాల వలన రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలు, సీఎంఆర్ సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, క్లినింగ్ మిషన్, గన్నీ బ్యాగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని, తరలింపునకు అవసరమైన లారీలు ఏర్పాటు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలను పర్యవేక్షించి రోజూ వారి రిపోర్టులు సమర్పించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఎంఆర్ సరఫరాపై మిల్లుల వారీగా చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎస్‌వో నందిత, డీఎం సివిల్ సప్లయి శ్రీకళ, డీసీవో నర్సయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

### అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నాణ్యతగా చేపట్టాలి

నాణ్యతా ప్రమాణాలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జూన్ 5వ తేదీలోగా పనులను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, మరుగుదొడ్లకు నీటి సదుపాయం, కాంపౌండ్ వాల్, విద్యుత్ పనులు, స్లాబ్ మరమ్మతులు, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్ వంటి పనులు చేపట్టాలని ఆదేశించారు. పనుల ప్రారంభం ముందు, తర్వాత ఫొటోలతో కూడిన నివేదికలు సమర్పించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి నిర్దేశించిన గడువులోగా పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల వారీగా చేపట్టిన పనులు, మరమ్మతులకు సంబంధించి వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు, ఇంజినీరింగ్, మున్సిపల్, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అధికారులకు వెదురు బుట్టలు అందజేత

పెంబి మండలం కొలంగూడ, పసుపుల గ్రామ పంచాయతీలకు చెందిన గిరిజనులు చేతితో అల్లిన వెదురు బుట్టను నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు అందజేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా పెంబి మండలంలో నీతి ఆయోగ్ ఎంపిక చేసిన బ్లాక్‌లలో చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి పురోగతిపై కలెక్టర్‌కు వివరించారు.

## నేడు యథావిధిగా జొన్నల కొనుగోలు

జైనథ్, మే 15 : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న జొన్నల కొనుగోలు యథావిధిగా ఉంటుందని సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని నిరాల, నిజాంపూర్ గ్రామాలతో పాటు బేల మండలం ఆవల్‌పూర్ గ్రామ రైతులు జొన్న పంటను తీసుకురావాలని కోరారు. ఈ జొన్న పంట కొనుగోలుకు సంబంధించిన అంశాన్ని రైతులు సహకరించాలని కోరారు.

## అధికారిపై చర్యలు తీసుకోవాలి

భైంసా, మే 15 : రంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులు వారికి ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం రావాల్సిన రెమ్యూనరేషన్ అడిగినందుకు వారిపై పోలీసులచే లాఠీచార్జి చేయించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్ర బాబు, బీవీ రమణ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట, గజ్వేల్, తదితర ప్రాంతాల్లో ఐదు రోజుల రెమ్యూనరేషన్ చెల్లించిన విషయాన్ని దృష్టికి తీసుకెళుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతిగా రెమ్యూనరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై అసహనంతో పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానుషమన్నారు. దీనికి కారణమైన అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## మార్కెట్ కమిటీ నిధులకు ఆడిట్



ఆడిట్ చేస్తున్న అధికారులు సల్లాఉద్దీన్, ఖలీం

బోథ్, మే 15 : బోథ్ మార్కెట్ కమిటీకి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులకు బుధవారం రాష్ట్ర ఆడిట్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక కార్యాలయంలో ఆడిట్ నిర్వహించారు. సీనియర్ ఆడిటర్లు సయ్యద్ సల్లాఉద్దీన్, ఎం ఖలీం రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. వచ్చిన నిధులకు సంబంధించిన పత్రాలు, రిజిస్టర్లు, ఖర్చు చేసిన వాటి వివరాలు, జీతభత్యాలు తదితర చెల్లింపులకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి మనోహర్, జూనియర్ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ స్వామి, ముఖీద్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

నిర్మల్ అర్బన్, మే 15 : ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బందికి ఆర్టీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రిక వైద్య పరీక్షలు చేశారు. 430 మంది ఉద్యోగులు ఉండగా తొలిరోజు 80 మంది ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## మూగజీవుల దాహార్తి తీరుస్తాం



నీటి తొట్టిను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి గంగన్న

నమస్తే ఎఫెక్ట్

తాంసి, మే 15 : గిరిగామ గ్రామంలోని మూగజీవుల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి గంగన్న అన్నారు. 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'మూగ జీవాల దాహం కేక' నీరు దొరకక ఇబ్బందులు పడుతున్న పశువుల కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గిరిగామ గ్రామంలో పశువుల తొట్టె శుభ్రం చేయించి నీటిని వదిలేలా చర్యలు చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న నీటి తొట్ల నిర్మాణాన్ని చేపడుతామని అన్నారు. పశువులతో పాటు గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. వారి వెంట గ్రామస్తులు ఉన్నారు.

# బోథ్ గురుకుల సందర్శన



వర్మికంపోస్టు తయారీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

బోథ్, మే 15 : బోథ్ గురుకుల పాఠశాలలో చేపడుతున్న నీటి సంరక్షణ పనులను బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం సభ్యులు సందర్శించారు. జాతీయ స్థాయిలో జల వనరుల సంరక్షణలో భాగంగా రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి. వాటిలో స్థానిక గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల ఉండడంతో శాస్త్రవేత్త ఉపేందర్, ఇంజినీర్ విభాగం అధికారి కృతిక ఆధ్వర్యంలో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు. నీటి పునర్వినియోగం పద్ధతులు అందు కోసం చేపట్టిన నిర్మాణాలు పరిశీలించారు. అనంతరం కిచెన్ గార్డెన్, వర్మికంపోస్టు తయారీ, వర్షపునీటి నిల్వ రిసైకిలింగ్ ప్లాంటేషన్, సంబంధిత రికారులు పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో రమేశ్, ఈజీఎస్ ఏపీడీ కృష్ణారావ్, ఏపీవో జగ్దేరావ్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సూర్యప్రకాశ్, ఉపాధ్యాయులు సంతోష్, అమాన్, శ్రీనివాస్ ఉన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మే 15: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఉమ్రి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన అంబేద్కర్ జయంత్యుత్సవాలకు ఆయన హాజరయ్యారు, ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కిన్వట్ సామాజిక కార్యకర్త కుడ్మెత వికాస్, దళిత నాయకుడు భారత్ వాగ్మారే, బహుజన సంఘాల నాయకులు, దళితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

## కార్యాలయ సందర్శన

ఎదులాపురం, మే 15 : మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ కార్యాలయాన్ని బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా సందర్శించారు. ముందుగా ఆయనకు జిల్లా సంక్షేమాధికారి సబిత, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. శాఖ యొక్క పని తీరును అడిగి తెలుసుకున్నారు. శిశు సంక్షేమ శాఖ, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ , శిశుగృహ, బాలసదనంల పని తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలరక్షక్ భవన్ పని తీరు గురించి, పోషణ అభియాన్, మహిళా సాధికారత, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 పని తీరును అధికారులు వివరించారు. కలిసిన వారిలో కార్యాలయ పర్యవేక్షకురాలు విమల, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, మహిళా సాధికారికత జిల్లా కోఆర్డినేటర్ యశోద ఉన్నారు.



అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు, డీసీపీవో, సిబ్బంది


## ధాన్యాన్ని గోదాములకు తరలించాలి



పాక్‌పట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

సోన్, మే 15: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే గోదాములకు తరలించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం పాక్‌పట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేయాలని, అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఐకేపీ ఏపీఎం గంగామణి, ఏపీవో మంజుల, రైతులు ఉన్నారు.

## నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న సభ్యులు

కుభీర్, మే 15: బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో చేపడుతున్న మున్నూరు కాపు వసతి గృహం, నిత్యాన్నదాన సత్రం కొరకు విరాళాలు సేకరిస్తున్నారు. బుధవారం కుభీర్ మండలం పల్సి గ్రామ మున్నూరు కాపు సంఘం తరపున రూ.1,01,111 విరాళంగా తాలూకా సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేశ్‌కు బుధవారం సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పల్సి సంఘం అధ్యక్షుడు కొట్టె సత్యనారాయణ, సాయినాథ్, రాందాస్, హన్మాండ్లు, తోట శేఖర్, సబ్బిడి రాజు, డాక్టర్ రాజన్న, మండల సంఘం అధ్యక్షుడు వివేకానంద, పీరాజీ, హన్మాండ్లు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ, మే 15 : గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐదు సంవత్సరాల కాలంలో మండలాన్ని అన్ని రంగాల్లో కలిసి కట్టుగా పని చేసి అభివృద్ధి దిశగా తీసుకురావడం జరిగిందన్నారు. అందుకు సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా మండలంలో వ్యవసాయం, విద్య, వైద్యం, పశువైద్యం, ఉపాధి హామీ, తాగునీరు, సాగునీరు, ఐకేపీ, అటవీ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు జరిగిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, వైస్‌ఎంపీపీ మహేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందించరూ..

- ఆర్థిక ఇబ్బందులతో జాతీయ స్థాయి పోటీలకు దూరం



సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలతో నాగలక్ష్మి

నిర్మల్ అర్బన్, మే 15 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సింగపూర్ గ్రామానికి చెందిన గాజుల నాగలక్ష్మి ఇటీవల సోన్ కేజీబీవీలో పదో తరగతి పూర్తి చేసింది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్‌పై పట్టు సాధించిన ఆమె ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. పోటీల్లో ప్రతిభ కనబర్చి బ్రాంజ్, సిల్వర్, గోల్డ్ మెడల్స్‌ను సాధించింది. ఇటీవల వనపర్తిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు నాగలక్ష్మిని ఎంపిక చేశారు. ఈ నెల 21వ తేదీన మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. తల్లి బీడీలు చుడుతూ, తండ్రి వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఆర్థిక సమస్యలతో జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ నిర్వాహకులు కడారి నరేశ్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని సహాయం చేయాల్సిన వారు 9490645726 నంబర్‌కు గూగుల్‌పే చేయగలరని కోరుతున్నది.

## నర్సుల దినోత్సవం



కేకు తినిపించుకుంటున్న నర్సులు

భైంసా, మే 15 : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో బుధవారం నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్ కేక్ కట్ చేసి నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నర్సులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

నర్సాపూర్(జీ), మే 15: కుస్లీ గ్రామంలో ఏఈవో భాగ్యలక్ష్మి బుధవారం రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొనేటప్పుడు అధీకృత డీలర్ వద్ద రసీదు తీసుకొని కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు లూజు సంచులలో ఎవరైనా అమ్మితే వ్యవసాయ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. రైతులు భూమేశ్, గంగారాం, గణేశ్ పటేల్, రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

## గొడవకు పాతకక్షలే కారణం

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్‌లో పాతకక్షలే కారణంతో రెండు గ్రూపుల మధ్య గొడవకు దారి తీసిన ఘటన చోటు చేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ సమీపంలోని బ్రిడ్జి వద్ద టైగర్ గ్రూపునకు చెందిన జాదవ్ గోపాల్, మహాకాల్ గ్రూపునకు చెందిన మహాకాల్ అజయ్ మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో జాదవ్ గోపాల్‌పై మహాకాల్ గ్రూపునకు చెందిన వారు రాళ్లు, కట్టెలతో కొట్టారు. దీంతో జాదవ్ గోపాల్ తలకు తీవ్ర గాయలై కింద పడిపోగా కొట్టిన వారు అక్కడి నుంచి పారిపోయారు. గమనించిన స్థానికులు జాదవ్ గోపాల్‌ను రిమ్స్‌కు తరలించారు. జాదవ్ గోపాల్ ఫిర్యాదు మేరకు మహాకాల్ అజయ్, మహాకాల్ జైరాం, సాజన్, నాయన్, విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

## కొండ చిలువ హతం

బైంసాటౌన్, మే 15 : దేగాం గ్రామ శివారులో 12 అడుగుల కొండ చిలువ రైతుల చేతిలో హతమైంది. మోహన్ పాటిల్ అనే రైతు పొలంలో కొండ చిలువ కనిపించగా అటుగా వెళ్తున్న కొందరు రైతులు కర్రలతో కొట్టి చంపేశారు. కాగా గత కొద్ది రోజుల నుంచి కొండ చిలువ సంచరించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. కొండచిలువ హతమవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

## నిలిచిన విద్యుత్ సరఫరా

బోథ్, మే 15 : బోథ్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షంతో మధ్యాహ్నం 3 నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇచ్చోడలోని 132/22 కేవీ సబ్ స్టేషన్ నుంచి బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాలకు సరఫరా చేస్తున్న 33కేవీ విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8 గంటలు దాటిన విద్యుత్ రాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఆలయంలో దొంగతనం

సారంగాపూర్, మే 15: జామ్ గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో బుధవారం దొంగతనం జరిగినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఆలయం తాళాలు పగలగొట్టి అమ్మవారి ఒక జత సుమారు గ్రాము బంగారు పుస్తేలతాడు, వెండిముక్కు గడేలు ఒక తులం దొంగతనం చేసినట్లు చెప్పారు. అదే విధంగా హుండీ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న డబ్బులను కూడా తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు అడెల్లి పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవం

కుభీర్, మే 15 : కుభీర్ శివారులోని పురాతన అడెల్లి పోచమ్మ ఆలయాన్ని పునర్నించారు. ఈ నూతన ఆలయ ప్రారంభోత్సవం గురువారం జరుగనుంది. దాతల సహకారంతో మూడు నెలలుగా ఆలయాన్ని నిర్మింప చేశారు. వేద పండితులచే హోమ యజ్ఞాది కార్యక్రమాల నిర్వహణ అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకుడు పోగుల బాబు కోరారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

ఎదులాపురం, మే 15 : జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన ఈవీఎంలు ,సీసీ కెమెరాలను బుధవారం రిటర్నింగ్ అధికారి రాజర్షి షా పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.